ఆధ్యాత్మికం

వైభవంగా బీరప్ప, కమరావతిలకు అభిషేకాలు



విద్యానగర్‌లోని బీరప్ప మహంకాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న బీరప్ప కమరావతి కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం అక్క మాంకాలమ్మ, బీరప్ప స్వామి, కమరావతిలకు పాలు, నెయ్యితో విశేష అభిషేకాలు నిర్వహించారు. విద్యానగర్, నవీన కురుమవాడ, సంతోశ్‌నగర్, రాంనగర్‌ల లోని కురమ కుల సభ్యులు ఇంటి నుంచి పాలు, నెయ్యితో దప్పు చప్పళ్లతో ఊరేగింపుగా వచ్చి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కర్రె అనిల్ కుమార్, ముఖ్య సలహాదారుడు కర్రె ప్రవీణ్‌కుమార్, సలహాదారులు బీర్ల నర్సయ్య, కర్రె రాజు, బీర్ల పెద్ద కనకయ్య, దయ్యాల లక్ష్మీపతి, రాజు, మహేశ్, ఎలకపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

- కరీంనగర్‌కల్చరల్


చిత్ర కథ

ఇంకెన్నాళ్లు..



కరీంనగర్‌లోని కాపువాడలో స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా ఆరు నెలల క్రితం డ్రెయినేజీ నిర్మాణం కోసం నివాసాల ఎదుట తవ్వి వదిలేశారు. దీంతో తవ్విన గుంతల్లో మురుగునీరు నిలిచి దోమలతో సావాసం చేయలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ విద్యానగర్, టవర్‌సర్కిల్, హౌసింగ్‌బోర్డు ఫీడర్ల పరిధిలోని హిందూపురికాలనీ, విజయదుర్గకాలనీ, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాపు, మామిడితోట, అహ్మద్‌పుర, శిశుమందిర్, విట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాముల శ్రీకాంత్, కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని 29వ డివిజన్ నాయీ బ్రాహ్మణ వీధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యకరమైన జీవితం ఉన్నప్పుడే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పాతబజార్ గౌరీశంకర ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. గౌరీశంకరాలయ ఆదాయం రూ.87,345. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆదాయం రూ.56,335 సమకూరినట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

కరీంనగర్‌రూరల్: అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో శుక్రవారం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరటాల శివరామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, అధికార ప్రతినిధులు స్వామి, సత్యనారాయణరెడ్డి, పాశం తిరుపతి, నరేశ్, రమణారెడ్డి, పూర్ణచందర్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి సమ్మెలో పాల్గొంటుండటంతో వారి స్థానంలో పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో 8 గ్రామ పంచాయతీలుండగా మల్కాపూర్, బద్దిపల్లి, కమాన్‌పూర్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు సమ్మెకు వెళ్లడంతో బద్దిపల్లికి నాగులమల్యాల కార్యదర్శి డి.సుష్మిత, కమాన్‌పూర్‌కు ఆసిఫ్‌నగర్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మల్కాపూర్‌కు చింతకుంట కార్యదర్శి లచ్చయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

విద్యానగర్(కరీంనగర్): రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలన్నారు. రైసుమిల్లు యజమాన్యాలు ఇబ్బందుల గురిచేస్తూ బస్తాకు 5 నుంచి 6 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఆర్టీసీ వర్క్ షాపు వద్ద ఉన్న కనకదుర్గ చిట్ ఫండ్స్ బ్రాంచ్ ఏజీఎం, బీఎం, బీఐటీలు రాంమోహన్‌ను చంపుతానని బెదిరించినట్లు వచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని త్రీటౌన్ సీఐ దామోదర్ రెడ్డి తెలిపారు. కనకదుర్గ చిట్‌ఫండ్ ఉద్యోగిగా, ఏజెంట్‌గా పనిచేస్తున్న తిమ్మాపూర్ మండలానికి చెందిన రావుల రాంమోహన్‌కు చిట్ యాక్షన్ విషయంలో గొడవ జరిగిందన్నారు. ఈ విషయంలో చంపుతానని బెదిరించినట్లు రాంమోహన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

మాయిశ్చర్ తిప్పలు

- మబ్బులతో ఆందోళన చెందుతున్న రైతులు
- కేంద్రాలు ప్రారంభించినా.. తూకంలో జాప్యం



మల్కాపూర్‌లో వరిధాన్యం ఆరబెడుతున్న రైతులు

కొత్తపల్లి: మొగులు.. మబ్బులు.. చిరుజల్లులు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. నాలుగు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలకు యాసంగి పంటకు నష్టం వాటిల్లుతోంది. ఓ వైపు వరికంకులు నేలరాలుతుండగా.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లోని వరిధాన్యం తడుస్తోంది. ఫలితంగా ఈ వాతావరణ పరిస్థితుల మూలంగా ఏ చేయాలో తెలియని అయోమయ స్థితిలో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఆరుగాలం కష్టపడ్డ చేతికందే సమయంలో అకాల వర్షాల రూపంలో నష్టాన్ని తెస్తున్న పరిస్థితులను చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు. అదేవిధంగా వర్షాలకు నానిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతన్న శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం మబ్బులు కమ్మేయడంతో పాటు చిరుజల్లులు పడటంతో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు, టార్పాలిన్‌లను తీసేందుకు రైతులు సాహించలేదు. కవర్లు, టార్పాలిన్లు తొలిగిస్తామంటే వర్షం కురుస్తుందోమోనన్న ఆందోళన ఓ వైపు ఉండగా.. ఆరబెట్టక పోతే ఎలా అన్న ఆవేదన మరోవైపు రైతులను ఇబ్బంది గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టగా.. మరికొంతమంది రైతులు ధాన్యం కుప్పలపై కవర్లను అలానే ఉంచారు.

ధాన్యం రాశులతో కొనుగోలు కేంద్రాలు

కొత్తపల్లి మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో నిండుకున్నాయి. వరుణ దేవుడు కరుణిస్తే గాని మాయిశ్చర్ వచ్చే పరిస్థితి లేదు. పక్షం రోజుల కిందట కోసిన వరిధాన్యం మాయిశ్చర్ వచ్చినప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసాయి. వాటిని ఆరబెట్టిన రైతులకు శుక్రవారం నుంచే కాంటా వేయడం ప్రారంభించారు. ఇంకా అనేక కేంద్రాల్లో ధాన్యంకు మాయిశ్చర్ రాక తూకం వేయడం ఆలస్యంగా మారింది. వరిధాన్యం మాయిశ్చర్ వచ్చి కొనుగోళ్లు జరిగే వరకు రైతులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. త్వరిగతిన ధాన్యం తూకం వేసి ప్రకృతి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మాయిశ్చర్ సమస్య

వానలు.. మబ్బులతో ధాన్యం ఎండక మాయిశ్చర్ సమస్య తలెత్తుతోంది. అయితే వర్షాలకు ముందు కోతలు పూర్తయిన ధాన్యంకు మాత్రమే మాయిశ్చర్ రావడంతో కొనుగోళ్లు శుక్రవారం నుంచి ప్రారంభించారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి పట్టణంలో 2, చింతకుంట, మల్కాపూర్, ఖాజీపూర్, బద్దిపల్లి, కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో కమాన్‌పూర్, ఎలగందుల, నాగులమల్యాల, ఐకేపీ ఆధ్వర్యంలో ఆసిఫ్‌నగర్‌లలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అయితే ఇందులో ఆసిఫ్‌నగర్ మినహా మల్కాపూర్, ఖాజీపూర్, బద్దిపల్లి, కమాన్‌పూర్, ఎలగందుల, నాగులమల్యాల గ్రామాల్లో ధాన్యం తూకం ప్రక్రియ ప్రారంభమైంది.

భగీరథ నీటి సరఫరా బంద్

- కొత్త పైపులైన్ నిర్మాణంతో నిలిపివేత
- 44గ్రామాలకు వారం రోజులుగా పంచాయతీ నీరు



కొత్తగా వేస్తున్న పైప్‌లైన్

కరీంనగర్‌రూరల్: మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కొత్తపైపులైన్ నిర్మాణంతో వారం రోజుల నుంచి నీరు రాకపోవడంతో 44 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా పంచాయతీబావుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోవడంలేదని మహిళలు వాపోతున్నారు.

44గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

ఎల్ఎండీలోని ఇన్‌టెక్ వెల్ ద్వారా వచ్చిన నీటిని ఎలగందల్‌లోని సంపుహౌస్‌లో శుద్ధి చేస్తారు. కమాన్‌పూర్‌గుట్టపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, రామడుగు మండలాల్లోని 44 హ్యాబిటేషన్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పద్మనగర్–ఒద్యారం రోడ్డు విస్తరణలో భాగంగా బావుపేట సమీపంలో బ్రిడ్జి నిర్మించారు. దీంతో భగీరథ పైపులైన్ బ్రిడ్జి కిందకు పోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశముండటంతో ప్రత్యామ్నాయంగా కొత్త పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈనెల 22 నుంచి పైపులైన్ పనులు ప్రారంభించడంతో గ్రామాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. భగీరథ నీరు వారం రోజుల నుంచి 44 హ్యాబిటేషన్లకు రాకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. అయితే ప్రత్యామ్నాయంగా అధికారులు ఆయా గ్రామాల్లోని రక్షిత బావుల నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సరిపడేంతగా నీరు రావడం లేదని పలు గ్రామాల్లోని మహిళలు ఆరోపిస్తున్నారు.

పైపులైన్ పనులు పూర్తి

కొత్త పైపులైన్ నిర్మాణంతో గ్రామాలకు భగీరథ నీటి సరఫరాను నిలిపివేశాం. పైపులైన్ పనులు చివరి దశకు చేరాయి. శనివారం సాయంత్రం వరకు నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం.

– మహేందర్, ఏఈ, భగీరథ గ్రిడ్

ఉత్తమ రచనలతోనే సమాజం వికసిస్తుంది

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



ముదుఘంటికలు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌కల్చరల్: సాహితీవేత్తలు, కవులు ఉత్తమ రచనలు చేయడం వల్లనే సమాజం వికసిస్తుందని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి రచించిన «ముదుఘంటికలు» కవితా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజానికి ఈ కవితలు మేలుకొలుపుగా, విజ్ఞాన వీచికలుగా ఉపకరిస్తూ భావితరాలకు బంగారు బాట వేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కృషి భవన్ అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, జిల్లా సీనియర్ సిటిజన్స్ కోశాధికారి చింతల సత్యనారాయణ, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎం.దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులోనే ప్రమాదాలు

- అడిషినల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ఎస్.శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అడిషనల్ డీసీపీ (శాంతిభద్రతలు) ఎస్.శ్రీనివాస్ అన్నారు. మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలోని ఓపెన్ థియేటర్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు పాల్పడటాన్ని హత్యానేరం కన్నా తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. స్వయంగా ప్రమాదాలకు గురవ్వడంతో పాటు ఇతరులకు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రెండోసారి పట్టుబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వారి లైసెన్సులను రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులతో తాము మళ్లీ మద్యం సేవించి వాహనాలు నడుపబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ అధికారి గైట్ మహేశ్ బాబాసాహెబ్, ఏసీపీ బి.విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు తిరుమల్, దామోదర్‌రెడ్డి, నటేశ్‌లు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కరీంనగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ ప్రభుత్వ విద్యావ్యవస్థ బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యారంగంపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విచారణలో కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి మొలుగూరి హరికృష్ణ, నాయకులు కాశపాక వినోద్, రమేశ్ యాదవ్, మొలుగూరి అరుణ్ తేజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలగందుల కారోబార్ తొలగింపు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కారోబార్ మాడిశెట్టి అజయ్‌కుమార్‌పై వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్యం, గ్రామంలోని సర్వే నం.12లో గల ప్రభుత్వ భూమిలో సోదరుడి ద్వారా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఇతరులు అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రోత్సహిస్తున్నాడని విచారణలో రుజువు కావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు కారోబార్ (ఎంపీడబ్ల్యూ వర్కర్) విధుల నుంచి తొలగిస్తూ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు పలుమార్లు మండల ప్రజా పరిషత్ సమావేశాల్లో కారోబార్ అంశాన్ని గ్రామ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ లేవనెత్తడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో వాస్తవాలు రుజువు కావడంతో అతడిని విధుల నుంచి తొలగిస్తూ జీపీ/ఎలగందుల/39/2023 పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ ఇన్వాలిడేషన్‌పై మంత్రికి వినతి



హరీశ్‌రావుకు విన్నవిస్తున్న శ్రీనివాస్

కరీంనగర్: ప్రభుత్వ ఉద్యోగులు అనారోగ్య కారణంగా వలంటరీ రిటైర్మెంట్ కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్‌పై కేవలం ఏడు వ్యాధులు మాత్రమే అప్లికేబుల్ కావడం వల్ల చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. జీవోఎంఎస్ 661లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. చాలా మంది అనారోగ్యంతో ఉన్నా వలంటరీ రిటైర్‌మెంట్ కోసం వారికి అవకాశం రావడం లేదన్నారు. డాక్టర్లతో మెడికల్ బోర్డులో ఇన్వాలిడేషన్ అయినప్పటికీ మళ్లీ అధికారులు రీఎగ్జామినేషన్ చేపించడంతో ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయని మంత్రికి వివరించారు. కేవలం ఏడు వ్యాధులే వలంటరీ రిటైర్‌మెంట్‌కి అర్హత కలిగి ఉన్నందున 661ని మరోసారి పునఃపరిశీలన చేసి ఇతర తీవ్రమైన వ్యాధులను కూడా అందులో చేర్చాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మారుముల్ల సాంబయ్య ఉన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

కరీంనగర్‌రూరల్: సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో రజక మహిళలు హక్కుల కోసం పోరాడాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం తీగలగుట్టపల్లి సరస్వతీనగర్‌లో జరిగిన రజక సంఘం మహిళా విభాగం జిల్లా సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రజక కార్పొరేషన్‌కు పాలకవర్గం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా మహిళలకు రూ.2లక్షల రుణాలివ్వాలని కోరారు. జూన్‌లో రజకుల డిమాండ్ల సాధన సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గుండేటి మల్లీశ్వరీ, ప్రధాన కార్యదర్శి సుమలత, అర్చన, కవిత, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- మేయర్ సునీల్‌రావు



కళ్లద్దాలు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని 54వ డివిజన్ కాశ్మీర్‌గడ్డ రైతుబజార్ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల్లో అంధత్వాన్ని దూరం చేయాలనే సంకల్పంతో కంటి వెలుగు ద్వారా మీ ఇంటి వద్దకే ఉచిత కంటి దావాఖానాను తీసుకొచ్చారని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకొని సమస్యలు దూరం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇక్రా తహెరీన్ అధినా, అధికారులు, వైద్య సిబ్బంది, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

18వ డివిజన్ రేకుర్తిలో రూ.24 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మేయర్ సునీల్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వెనుకబడిన శివారు ప్రాంత డివిజన్లు, విలీన గ్రామాల డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుధగోని మాధవి, డీఈ మసూద్ అలీ, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రధాన కూరగాయల మార్కెట్‌రోడ్డులోనే దుర్గంధం



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ రోడ్డులోనే దుర్గంధం వెదజల్లుతోందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి మాట్లాడారు. ఎనిమిది నెలల క్రితం మురుగు కాలువ నిర్మించాలని ధర్నా చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. పక్కనే ఉన్న మున్సిపల్ గెస్ట్‌హౌస్ భవనం పాములకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని తెలిపారు. చెత్త చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుల వర్గ పోరుతోనే నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఇప్పటికైనా వర్గపోరును పక్కన పెట్టి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దన్నాసింగ్, జీడీ రమేశ్, ముక్క భాస్కర్, సలిమొద్దీన్, అనిల్‌కుమార్ గుప్తా, మెతుకు కాంతయ్య, నెల్లి నరేశ్, కీర్తి కుమార్, శివరాం, సిరాజొద్దీన్, మహ్మద్ బారీ, జాఫర్, అశ్రాఫ్, అజ్మత్, సోహెల్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం



కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు నాలుగు రోజులుగా వేసవి జాగ్రత్తల గురించి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కల్పించిన సందర్భంగా వారికి ఆ పాఠశాల చైర్మన్ ఇ. ప్రసాదరావు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నగరంలోని జ్యోతిరావుపూలే మైదానం, శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణం, శ్రీరాజరాజేశ్వర డిగ్రీ కళాశాల మైదానం, అంబేడ్కర్ స్టేడియం, మానేరు డ్యామ్‌లకు బృందాలుగా వెళ్లి ఆయా మైదానాల్లో వ్యాయామకం కోసం వచ్చే వారికి రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలపై అవగాహన, వడదెబ్బ సమయంలో తీసుకోవాల్సిన ఆహార నియమాలు, ఈతకొలనులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించి సర్టిఫికెట్లు అందించి అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, ప్రసూన, వీయూయం ప్రసాద్, రాకేశ్, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, హరిప్రియ, రాచెల్, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి

కరీంనగర్: కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. రైతులకు పరిహారం అందించాలని కోరారు.